క్లుప్తంగా

పొదలకూరులో ఆరోగ్య సురక్ష సర్వే


బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పట్టణంలోని కాకాణి రమణారెడ్డి నగర్‌లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న అందరికీ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. సర్వేను కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు కిరణ్‌రిషిత, శ్రీకావ్య తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డుసభ్యుడు ఎస్‌కే అంజాద్, విస్తరణాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి సన్మానం


శ్రీలతను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోవూరు: కోవూరు జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలతను నెల్లూరు జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీగా రెండేళ్లు పూర్తి చేసుకున్నందుకు గానూ ఆమెను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపికలు

వెంకటాచలం : నవంబర్ నెలలో జరుగనున్న ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు విశ్వవిద్యాలయస్థాయి ఎంపికలు కాకుటూరులోని వీఎస్‌యూలో సోమవారం జరిగింది. ఈ ఎంపికలకు కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి, యూత్ అధికారి ఆర్.సైదానాయక్ వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన వారిలో 65 మంది మహిళలను వివిధ అంశాల ఆధారంగా పరీక్షించి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లగా ఎంపిక చేశారు. ముఖ్యంగా ఎత్తు 150 సెంటీమీటర్లు, పది నిమిషాల్లో 1,500 మీటర్లు పరుగెత్తడం, స్పెషల్ క్యాంపు, సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యత కలిగిన వారిని ఎంపిక చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మోటార్ బైక్

- వ్యక్తికి గాయాలు

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కాగులపాడుకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి తన దినచర్యలో భాగంగా బైక్‌పై బుచ్చిరెడ్డిపాళేనికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడు. గాయలతో రోడ్డుపై పడి ఉన్న శ్రీనివాసులును స్థానికులు బుచ్చిరెడ్డిపాళెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమగ్ర దర్యాప్తుతో నిందితులకు శిక్షలు

- ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సమగ్ర దర్యాప్తుతో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు సిబ్బందితో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చోటు చేసుకున్న పెండింగ్ గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఆస్తి, తదితర నేరాలపై సమీక్షించారు. కేసుల పెండెన్సీ తగ్గించేందుకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, నో యాక్సిడెంట్ వీక్ పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, బ్లాక్‌స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసులను మొదటి ప్రాధాన్యతగా స్వీకరించి, సాంకేతికత ఆధారంగా ఛేదించి వారి కుటుంబసభ్యులకు అప్పగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలన్నారు. బ్యాంకు అధికారుల సమన్వయంతో సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో పాతనేరస్తులై ఉండి ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హత్యకేసులు, రాబరీ, పోక్సో, రేప్, ప్రాపర్టీ తదితరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, లీగల్ అడ్వైజర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఉప్పుకాలువకు వ్యర్థజలాల ముప్పు

- కలుషిత నీటితో మృత్యువాత పడుతున్న మత్స్యసంపద
- ఆందోళనలో తీరప్రాంత మత్స్యకారులు

తోటపల్లిగూడూరు : మండలంలో కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంత పరిధిలో ఉన్న ఉప్పుకాలువ(బకింగ్‌హామ్ కెనాల్) పరిశ్రమల వ్యర్థజలాలతో కలుషితమవుతోంది. దీంతో ఉప్పుకాలువలోని మత్స్యసంపద నిలువునా మృత్యువాత పడుతోంది. మండలంలోని తీరప్రాంత పంచాయతీలైన కోడూరు, వెంకన్నపాళెంలో దాదాపు 14 మత్స్యకార గ్రామాలున్నాయి. ఆయా మత్స్యకార గ్రామాల్లో 3 వేలకు పైగా కుటుంబాలు చేపలవేటనే జీవనాధారం చేసుకొని జీవిస్తున్నాయి. 2004 సునామీ తర్వాత మత్స్యకారుల జీవితాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. వరుస తుపాన్లు, వాయుగుండాలతో వేట సక్రమంగా సాగకపోవడంతో సముద్రాన్ని ఆనుకొని ఉన్న ఉప్పు కాలువలో చేపల వేటతో మత్స్యకారులు గత కొంత కాలంగా ఉపశమనం పొందుతూ వస్తున్నారు. అయితే సముద్ర తీరంలో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న పరిశ్రమల మూలంగా ఈ ఉప్పుకాలువలో చేపలవేటకు గ్రహణం పట్టింది.

వ్యర్థ జలాలతో..

తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల తీర ప్రాంతల్లో పలు విద్యుత్ పరిశ్రములు, ఆక్వా హేచరీలు కొలువుదీరాయి. వీటి నుంచి ప్రతిరోజు విషపూరితమైన రసాయన, వ్యర్థ జలాలు విడుదలవుతుంటాయి. ఇలా పరిశ్రమల నుంచి వెలువడే రసాయన, వర్థజలాలను పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద గొట్టాల ద్వారా సముద్రంలోకి, ఉప్పు కాలువలోకి వదులుతున్నాయి. దీంతో సముద్రంతో పాటు ఉప్పు కాలువ సైతం కలుషితమవుతోంది. దీనివల్ల ఉప్పు కాలువలోని మత్స్య సంపద మృత్యువాత పడుతోంది. సముద్రపు వేట అంతంత మాత్రమే సాగుతున్న పరిస్థితిలో కాస్త ఆసరాగా నిలుస్తున్న ఉప్పుకాలువ సైతం ఇలా కలుషితమై చేపలు మృత్యువాత పడుతుండడంతో వేటపై జీవించే మత్స్యకారులు తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోంది. ముఖ్యంగా గత కొన్ని మాసాలుగా తీరం వెంబడి ఉన్న వివిధ పరిశ్రమల నుంచి ఉప్పుకాలువకు భారీ ఎత్తున విషపూరితమైన వ్యర్థ జలాలు విడుదులవుతున్నట్లు స్థానిక తీర ప్రాంత వాసులు చెప్పుకొస్తున్నారు.


కోడూరు సమీపంలోని ఉప్పుకాలువ



పాతకోడూరు సమీపంలో ఉప్పుకాలువ వెంబడి మృత్యువాత పడిన చేపలు (ఫైల్)

మత్స్యసంపద దెబ్బతింటోంది


వ్యర్థ జలాలు, రసాయన మలినాలతో ఉప్పుకాలువ కలుషితమవుతోంది. సముద్రంలో వేట లేకపోయినా ఉప్పుకాలువలో చేపల వేటపై జీవిస్తున్నాం. కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలతో ఉప్పుకాలువలో ఉన్న మత్స్యసంపద దెబ్బతింటోంది. ఇప్పటి వరకు పరిశ్రమల వల్ల మాకు ఒరిగిందేమీ లేదు.
– కంజి శివ, మత్స్యకారుడు, పాతపట్టపుపాళెం

చర్యలు తీసుకోవాలి


కోడూరు తీరం వెంబడి వెలసిన విద్యుత్ పరిశ్రమలు, హేచరీల మూలంగా ఉప్పు కాలువ, పాతపట్టపుపాళెం క్రీక్‌లు కలుషితమవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పుష్కలంగా దొరికే మత్స్యసంపద హరించుకుపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా విషపూరిత రసాయనాలను ఉప్పుకాలువలోకి వదులుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.
– సుధాకర్, మత్స్యకారుడు, ముత్యాలతోపు పట్టపుపాళెం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


హేచరీలు లేదా ఇతర పరిశ్రమలు వ్యర్థ జలాలను ఉప్పు కాలువలోకి వదలడం నిషేధం. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసిన అనంతరం అది కూడా మత్స్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకునే వదలాలి. అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాలను ఉప్పు కాలువలోకి వదిలినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటాం.
– స్టీఫెన్, మత్స్యశాఖాధికారి, ఇందుకూరుపేట డివిజన్

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత


పచ్చదనం పరిశుభ్రత కోసం ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, విద్యార్థులు

వెంకటాచలం: పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి పేర్కొన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్, నెహ్రూ యువకేంద్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కాకుటూరు వద్ద నున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో సోమవారం స్వచ్ఛతే సేవ, నాభూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నాగసాయి సూరి మాట్లాడుతూ పరిసరాలను పచ్చగా ఉంచడంతో పాటుగా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడమే స్వచ్ఛతే సేవ, నా భూమి– నా దేశం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో యువతీ, యువకుల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ కోఆర్డినేటర్ మహేంద్ర మాట్లాడుతూ మొక్కలు నాటడం, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ పి.అశోక్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌శంకర్, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సభ్యురాలి వ్యాపారం పరిశీలన

కొడవలూరు : మండలంలోని గండవరంలో పొదుపు సభ్యురాలు నాగలక్ష్మి రూ.40 వేల సీడ్ క్యాపిటల్‌తో టీ, కాఫీ పొడుల వ్యాపారాన్ని నిర్వహిస్తుండగా దీనిని సెర్ప్ జీవనోపాధుల విభాగం రాష్ట్ర డైరెక్టర్ సరళ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమెతో మాట్లాడారు. రోజూ ఏ మేర పొడులు తయారు చేస్తున్నారు.. ఖర్చెంత.. ఆదాయమెంత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారం లాభసాటిగా ఉన్నందున వ్యాపారాన్ని మరింత విస్తృతం చేసేందుకు రూ.లక్ష రుణం అందిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ టీ, కాఫీ పొడుల తయారీ లాభదాయకంగా ఉందని, ఈమెను ఆదర్శంగా తీసుకొని పొదుపు సభ్యులు కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేసుకొంటే రుణ సాయమందించి ప్రోత్సహిస్తామన్నారు. తొలుత కొడవలూరు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘమిత్ర కార్యవర్గ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. జిల్లాలోని పలు మండలాల్లో స్త్రీనిధి వసూళ్లు మందకొడిగా ఉన్నాయని, ఆయా మండలాల్లో సమీక్షలు నిర్వహించి వసూలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం కామాక్షయ్య, ఏపీఎంలు ఎస్.రుక్మిణి, నాగేంద్ర ప్రసాద్, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, సంఘమిత్ర అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


పొదుపు సభ్యురాలు నాగలక్ష్మితో మాట్లాడుతున్న డైరెక్టర్ సరళ

పరీక్షల ఫీజు గడువును పొడిగించాలి

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలో డిగ్రీ పరీక్షలకు సంబంధించి ఇన్‌స్టెంట్ పరీక్ష ఫీజుల గడువు తేదీని పొడిగించాలని ఏబీవీపీ నేత రాజశేఖర్ కోరారు. కాకుటూరులోని వీఎస్‌యూలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డిని సోమవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసి ఉండగా, వాటి ఫలితాలు విడుదల చేయకుండానే ఇన్‌స్టెంట్ ఫీజులు కట్టించుకుంటే పరీక్ష రాసిన విద్యార్థులు ఇబ్బందులు పడుతారని తెలియజేశారు. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసేంత వరకు ఫీజు గడువు తేదీని పొడిగించాలని కోరారు.


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నేతలు

సీజనల్ హాస్టల్ ఏర్పాటుపై తనిఖీ

ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్రం గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటుపై స్టేట్ ఒకేషనల్ కోర్సు డైరెక్టర్ భారతి, రాష్ట్ర పరిశీలకులు అరుణ తదితరులు సోమవారం పర్యటించారు. గత సంవత్సరం ఈ గ్రామంలో సీజనల్ హాస్టల్ నిర్వహించారు. అయితే, హాస్టల్ నిర్వహణ అవశ్యకతపై అధికారులు గ్రామస్తులు, చిన్నపిల్లలతో మాట్లాడారు. పిల్లల సంఖ్య, స్థానికుల జీవన ప్రమాణాలపై ఆరా తీశారు. ఏ స్థాయిలో పిల్లలు హాజరయ్యారనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, ఎంఈఓ మధుసూదన, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.


చిన్నపిల్లలతో ముచ్చటిస్తున్న అధికారులు

విష్ణాలయంలో ఏకాదశి పూజలు

మనుబోలు : మనుబోలులోని విష్ణాలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి మంత్రోచ్ఛారణల మధ్య పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా రాధాకృష్ణయ్య–రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను పెనుగొండ సుధాకర్, ముంగర ధనుంజయరెడ్డి, కసుమూరు రామసుబ్బారెడ్డి, చల్లా శ్రీధర్ తదితరులు పర్యవేక్షించారు.


పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి

తోటపల్లిగూడూరు : ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై జంపానికుమార్ సోమవారం తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తోటపల్లి పంచాయతీ కామాక్షినగర్‌కు చెందిన ఈదూరు సింహాద్రి ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఆకతాయి పనులు చేస్తున్నాడు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన ఎంబేటి శివయ్య ప్రశ్నించగా సింహాద్రి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఇదే క్రమంలో అడ్డుకోబోయిన ఇదే గ్రామానికి చెందిన అన్నం మురళిపై కూడా అదే కత్తితో దాడి చేసి గాయపర్చి పరారయ్యాడు. స్థానికులు గుర్తించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఈదూరు సింహాద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.

రైతుల శ్రేయస్సే సొసైటీ లక్ష్యం

కోవూరు : రైతుల శ్రేయస్సు కోసం సొసైటీ పనిచేస్తుందని పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. పడుగుపాడులోని సొసైటీ కార్యాలయంలో మహాజన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడుగుపాడు సొసైటీ కింద 2021–22 రబీ సీజన్‌కు సంబంధించి హామీల నగదు రూ.30 లక్షలు రావాల్సి ఉందన్నారు. ముఖ్యంగా రైతులు సొసైటీలో డిపాజిట్ చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఇప్పటి వరకు బంగారంపై రుణాలు రూ.5.10 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.12 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.3.20 కోట్లు, హౌసింగ్ లోన్లు రూ.20 లక్షలు ఇచ్చి ఉన్నామన్నారు. అలాగే ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు 500 మెట్రిక్ టన్నుల గోదాములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇనమడుగులో ఉన్న సొసైటీ స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించి ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసేందుకు జిల్లాలో ఒక కేంద్రం మంజూరైందని, ఆ ఒక్కటి పడుగుపాడు సొసైటీ పరిధిలో ఇనమడుగు గ్రామంలో 2 ఎకరాల విస్తీర్ణాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పడుగుపాడు సొసైటీని అందరి సహకారంతో మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం 21 అంశాలపై చర్చించారు. సమావేశంలో సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, త్రిసభ్య కమిటీ సభ్యులు గున్నం జనార్దన్, అంబటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

దిగజారుడు రాజకీయాలు తగవు

వెంకటాచలం : రాజకీయ ఉనికి కోసం సోమిరెడ్డి దళితుల మధ్య చిచ్చుపెడుతున్నాడని, ఇలాంటి దిగజారుడు రాజకీయాలు తగవని వైఎస్సార్‌సీపీ దళిత నేతలు అన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏఎంసీ డైరెక్టర్ చీకుర్తి నరసయ్య, కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు మందా కృష్ణ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమిరెడ్డి రాజకీయ జీవితం సర్వేపల్లిలో ముగిసిపోయిందనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అయితే రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు గ్రామాల్లో ఏదైనా చిన్న సమస్య తలెత్తితే పెద్దది చేసి కులాల మధ్య చిచ్చు రేపుతున్నాడని తెలియజేశారు. కసుపూరులో దళితుల మధ్య జరిగిన కుటుంబ గొడవలో జోక్యం చేసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆపాదించడం దారుణమన్నారు. టీడీపీలో ఉన్న దళితులను పురమాయించి వైఎస్సార్‌సీపీ నాయకులపై స్థాయికి మించి విమర్శలు చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. మరోసారి నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు


జగనన్నకు చెబుదాంలో వినతుల స్వీకరణ

పొదలకూరు : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబుకు సోమవారం వినతిపత్రాలను సమర్పించారు. పొలాలకు దారులు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. వాటిని పరిశీలించిన డీటీ వీఆర్వోల ద్వారా విచారణ నిర్వహించి పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, హౌసింగ్ ఏఈ శివమోహన్, ఏంపీఎం రోజ్‌మేరి తదితరులు పాల్గొన్నారు.


వినతులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

వేడుకగా గణేశ్ నిమజ్జనోత్సవాలు


మనుబోలు : పడమటివీధి వినాయకుడి గ్రామోత్సవం


మనుబోలు పురవీధుల్లో విహరిస్తున్న బీసీ కాలనీ వినాయకుడు

- బీసీ కాలనీలో రూ.1.75 లక్షలు పలికిన లడ్డూ

మనుబోలు : మండలంలో వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. మనుబోలులో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. బీసీ కాలనీలోని వినాయక మండపంలో లడ్డూకు వేలం వేయగా రూ.1.75 లక్షలకు మోమిడి దిలీప్ దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడిలో వేసిన రూ.2 వేల విలువైన నోట్ల మాలను వేలంలో రూ.70 వేలకు చలగల సునీత, వెండి కాయిన్‌ను రూ.51 వేలకు చల్లా వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌లపై గణనాథులను కొలువుదీర్చి అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన డీజే, తీన్‌మార్ బ్యాండ్, డప్పు మేళాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

రూ.1.56 లక్షలు పలికిన లడ్డూ

పొదలకూరు : పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి ఆదివారం రాత్రి కోలాహలంగా నిమజ్జనం జరిగింది. స్వామివారి 35 కిలోల లడ్డూను గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ఆయన సోదరుడు వాకాటి శివప్రసాద్ రెడ్డి రూ.1.56 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఏడు రోజుల పాటు బొజ్జగణపయ్య విగ్రహానికి వైభవంగా పూజలు నిర్వహించారు. రూ.10 నోట్ల మాలను రూ.25 వేలకు మలిశెట్టి శివశంకర్, రూ.100 మాలను రూ.27 వేలకు ఎం.శ్యామ్‌ప్రసాద్, స్వామివారి వెండి విగ్రహాన్ని రూ.41 వేలకు సుధీర్‌నాయుడు వేలంపాటలో దక్కించుకున్నారు. పొదలకూరు సీఐ జి.సంగమేశ్వరరావు వేలంపాటలు పాడిన వారికి లడ్డూను అందజేశారు. ఏడురోజుల పాటు నిర్వాహక కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాణసంచా, మేళతాళాలతో గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. యువకులు ఉత్సాహంగా స్వామి ఊరేగింపులో పాల్గొన్నారు.


పొదలకూరు : స్వామివారి లడ్డూను అందజేస్తున్న సీఐ


పొదలకూరు : నిమజ్జనానికి సిద్ధం చేసిన వినాయకుని విగ్రహం